క్లుప్తంగా

పీహెచ్‌సీ పరిశీలన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడు లోని పీహెచ్‌సీని జిల్లా టీబీ, కుష్ఠు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ జీ బాలాజీ మంగళవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా టీబీ, కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని యూనిటీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. కళ్లె పరీక్షలకు వ్యాధిగ్రస్తులని అనుమానంగా ఉండే వారిని ఆస్పత్రికి తరలించి వారికి కళ్లె పరీక్షలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, దగ్గిన క్రమంలో కళ్లెలో రక్తం పడటం వంటివి టీబీ వ్యాధి లక్షణం అవుతుందని, పై లక్షణాలు ఉన్న వారు తప్పనిసరిగా పరీక్ష చేయించుకోవాలన్నారు. స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉన్న వారిని ఆశా వర్కర్లు గుర్తించి వారికి కుష్ఠు వ్యాధికి సంబంధించిన పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట లెప్రసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవాణి ఆస్పత్రి డాక్టర్ శ్రావణ్, సురేష్ కుష్ఠు వ్యాధి నివారణ ఏపీవో వరప్రసాద్, టీబీ సూపర్‌వైజర్ చంద్రమౌళి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై డైట్ ఛాత్రోపాధ్యాయులకు అవగాహన

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు డైట్ కళాశాలలో మంగళవారం ఛాత్రోపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాసం పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు అధ్యక్షత వహించారు. విద్యార్థులు సబ్జెక్టు వారీగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సుబ్బారావు పేర్కొన్నారు. పాండిచ్చేరి యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆంజనేయ స్వామి వ్యక్తిత్వ వికాసం పై విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన్ను డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, అధ్యాపకులు సత్కరించారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు

ఒంగోలు సిటీ: నూతన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం ఒంగోలులో నూతన జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి వినియోగదారులు, వ్యాపారులతో కలిసి మాట్లాడి నూతన జీఎస్టీ విధానంపై అవగాహన కల్పించారు. రత్నదీప్, ఉషోదయ సూపర్ మార్కెట్లలో వినియోగదారులతో మాట్లాడి తగ్గిన ధరలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొత్త జీఎస్టీ విధానం పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేదిగా ఉందన్నారు. జీఎస్టీ స్లాబ్‌ల్లో మార్పులు చేశారన్నారు. తొలుత మంగమూరు రోడ్డులో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గ్రామ సచివాలయంలో ప్రైవేట్ వ్యక్తి హల్‌చల్

మార్కాపురం టౌన్: మండలంలోని పెద్దనాగుల వరం గ్రామ సచివాలయంలో ఉద్యోగులు కూర్చునే కుర్చీలో ఓ ప్రైవేట్ వ్యక్తి దర్జాగా ఆసీనుడయ్యాడు. స్మార్ట్ రైస్ కార్డులు పరిశీలిస్తూ అధికార దర్పం ప్రదర్శించాడు. మంగళవారం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన పనిలో ప్రైవేట్ వ్యక్తులు తలదూర్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తహసీల్దార్ చిరంజీవిని వివరణ కోరగా పక్కనే వీఆర్వో ఉన్నారని, ఈ సంఘటనపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన

కంభం: జీఎస్టీ సక్రమ అమలుతో వ్యాపారాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ వీరభద్రాచారి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల వద్ద సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పన్ను విధానం, వస్తువుల ధరలపై జీఎస్టీ ప్రభావం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శనగ విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

కంభం: శనగ విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి మహమ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 1150 క్వింటాళ్ల శనగ విత్తనాలు కేటాయించారని పేర్కొన్నారు. శనగ విత్తనాలు క్వింటా ధర రూ.7,800 కాగా రాయితీపోను రూ.5850కు అందజేయనున్నట్లు తెలిపారు.

డీజేలు వాడొద్దు

దొనకొండ: మండల పరిధిలోని గ్రామాల్లో శుభ కార్యాలు, తిరునాళ్లు, ఇతర కార్యక్రమాలకు డీజేల వినియోగానికి అనుమతులు లేవని ఎస్‌ఐ టి.త్యాగరాజు స్పష్టం చేశారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ అనుమతులు పొందిన వారు మైకు లేదా సౌండ్ బాక్స్‌లు పరిమితి సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలన్నారు.

బీజేపీ పాలనలో దళిత ఐపీఎస్‌లకు రక్షణ కరువు

- హర్యానా ఐపీఎస్‌ను వేధించిన ఉన్నతాధికారులను అరెస్టు చెయ్యాలి
- దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నీలం, నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: బీజేపీ పాలనలో దళిత జడ్జిలు, ఐఏఎస్, ఐపీఎస్‌లకు భద్రత లేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్ర రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హర్యానా అడిషనల్ డీజీపీ పూరన్‌కుమార్ బలవన్మరణానికి నిరసనగా, ఆయన భార్య, ఐఏఎస్ అమనీత్ న్యాయ పోరాటానికి మద్దతుగా మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్ర మాట్లాడుతూ చిత్తూరు జిల్లా దళితుడైన పూరన్ కుమార్ 2001 బ్యాచ్ హర్యానా కేడర్ ఐపీఎస్‌గా ఎంపికయ్యారన్నారు. విధి నిర్వహణలో సమర్థతతో పాటు నిజాయితీ కలిగిన అధికారిగా ఆయనకు రాష్ట్రపతి ఉత్తమ సేవా పతకం కూడా ఇచ్చారన్నారు. పోలీసు శాఖలో కుల వివక్షతో పాటు అనేక అక్రమాలకు వ్యతిరేకంగా పూరన్ కుమార్ గళమెత్తారని చెప్పారు. పలువురు సీనియర్ పోలీస్ అధికారులు పగబట్టి వేధించారన్నారు. చివరకు ఓ లంచం కేసులో ఇరికించడంతో మనస్తాపానికి గురై 8 పేజీల సూసైడ్ నోట్ రాసి సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడన్నారు. సూసైడ్ నోట్‌లో డీజీపీ శత్రుజీత్ కపూర్, ఎస్పీ నరేంద్రతో సహా 10 మంది పోలీస్ అధికారులు తనను మానసికంగా ఎలా వేధించింది, తన కెరీర్‌ను నాశనం చేసేందుకు పన్నిన కుట్రలను ప్రస్తావించారన్నారు. పూరన్ భార్య ఫిర్యాదు మేరకు హరియాణా డీజీపీ శత్రుజీత్ కపూర్, ఎస్పీ నరేంద్ర బిజారిన్యా తదితరులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. అమనీత్ పోరాటం దళితులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. పూరన్ బలవన్మరణం, అమనీత్ న్యాయ పోరాటం మనువాద మోదీ బీజేపీ పాలనలో, సామాన్య దళితులకే కాదు, దళిత జడ్జిలు, ఐఏఎస్, ఐపీఎస్‌లు కూడా కుల వివక్షకు, వేధింపులకు గురవుతున్నారనే నిజాన్ని నిరూపించిందన్నారు. అమనీత్ కుటుంబానికి మనువాదుల నుంచి ముప్పు ఉందని, కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని నాగేంద్ర డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనలో బీజేపీకి, మోదీకి, వ్యతిరేకంగా, హర్యానా డీజీపీ, ఎస్పీలను అరెస్టు చెయ్యాలని నినదించారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరాం, దళిత నాయకులు కాకుమాను రవి, పిల్లి మాల్యాద్రి, మిట్నసల శాంతారావు, కసుకుర్తి రాజు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపరచాలి

- వసతి గృహాలను పరిశీలించిన సీపీఎం బృందం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ప్రభుత్వ వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు కోరారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఎం బృందం మంగళవారం పరిశీలించింది. ఒంగోలులోని రైలు గేటు వద్ద సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం–7ను పరిశీలించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాబు మాట్లాడుతూ ప్రస్తుతం వసతి గృహ విద్యార్థులకు మెనూ చార్జీల కింద నెలకు 1400 మాత్రమే మంజూరు చేస్తున్నారన్నారు. వసతి గృహాల్లో 2023 మెనూ చార్జీలనే నేటికీ అమలు చేయడం దుర్మార్గమని విమర్శించారు. ప్రస్తుత మార్కెట్లో పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు సరిపోవన్నారు. హాస్టళ్లలో మెనూ చార్జీలను వెంటనే పెంచాలన్నారు. జిల్లాలో 81 ఎస్సీ హాస్టల్స్ ఉండగా అందులో 36 హాస్టల్స్ నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగడం అన్యాయమని చెప్పారు. అద్దె భవనాల్లో హాస్టల్స్ ఉండటంతో సరైన సౌకర్యాలు లేక చాలీచాలని గదుల్లో విద్యార్థులు ఉండాల్సి వస్తోందని, విద్యార్థుల మానసిక ఎదుగుదల తగ్గుతుందన్నారు. కాస్మొటిక్ చార్జీలు 200 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని, వాటిని కూడా రెగ్యులర్‌గా విడుదల చేయడం లేదని మండిపడ్డారు. విద్యార్థులకు దుప్పట్లు వెంటనే పంపిణీ చేయాలని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండి రెగ్యులర్‌గా మెడికల్ చెకప్‌లు చేయించాలని డిమాండ్ చేశారు. 81 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నా 58 మంది రెగ్యులర్ వార్డెన్లు మాత్రమే ఉన్నారని, మిగిలిన హాస్టల్స్‌కు ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నడుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ట్యూటర్లకు ప్రస్తుతం 1500 జీతం ఇస్తున్నారని, ఇది చాలా తక్కువ మొత్తమని ట్యూటర్లకు గౌరవప్రదమైన జీతం ఇవ్వాలని కోరారు. 10వ తరగతి చదివే విద్యార్థులకు మెటీరియల్ త్వరితగతిన అందించాలన్నారు. జిల్లాలోని వసతి గృహాల్లో తగినంత మంది సిబ్బంది లేరన్నారు. జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా హాస్టళ్లలో బస చేసి విద్యార్థుల సమస్యలు ప్రత్యక్షంగా గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యుడు బి. రఘురామ్ పాల్గొన్నారు.

నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నేడు భారీ నిరసన ర్యాలీ

సింగరాయకొండ: రాష్ట్రంలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 15న సింగరాయకొండలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు డాక్టర్ ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కుటీర పరిశ్రమ లాగా నారా వారి నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న కూటమి ప్రభుత్వ పనితీరుకు వ్యతిరేకంగా నియోజకవర్గ స్థాయిలో జరిగే కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారన్నారు. పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొండపి: నకిలీ మద్యానికి నిరసనగా సింగరాయకొండలో బుధవారం జరిగే ర్యాలీలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.



రోడ్డుకు అడ్డుగా పడిపోయిన చింతచెట్టు

కర్నూలు రోడ్డుపై కూలిన చెట్టు



పడిపోయిన చింతచెట్టును తొలగిస్తున్న అధికారులు

- పైప్‌లైన్ కోసం కాలువ తీస్తుండగా ఘటన..
- గంటల తరబడి నిలిచిన వాహనాలు

ఒంగోలు టౌన్: నగరంలోని కర్నూలు రోడ్డులోగల నవభారత్ బిల్డింగ్ సెంటర్‌లో మంగళవారం భారీ చింతచెట్టు ఒక్కసారిగా నేలకొరిగింది. పైప్‌లైన్ ఏర్పాటు కోసం జేసీబీతో కాలువ తీస్తున్న సమయంలో చెట్టు కూలిపోయింది. నిత్యం వాహనాలు రాకపోకలు సాగించే ఈ హైవేలో చెట్టు పడిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో గంటల కొద్ది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మార్కాపురం వైపు వెళ్లే బస్సులు, కార్లు, గ్రానైట్ లారీలు పెద్ద సంఖ్యలో ఆగిపోయాయి. రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు, తాలుకా పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు చెట్టును తొలగించేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

బాలికలు ఉన్నత లక్ష్యంతో చదవాలి



మాలపాడులో విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ హేమలత

పొన్నలూరు: బాలికలు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యంతో చదవాలని జిల్లా బాల బాలిక అభివృద్ధి అధికారిని హేమలత అన్నారు. మండలంలోని మాలపాడు కేజీబీవీ విద్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించి పాఠశాల వసతులను పరిశీలించడంతో పాటు విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలకు కేజీబీవీ విద్యాలయాలు వరమని, ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ఇప్పటి నుంచే పది, ఇంటర్ విద్యార్థినులు చక్కని ప్రణాళికతో చదివి ఉన్నత మార్కులు సాధించాలన్నారు. అధ్యాపకులు కూడా సమయపాలన పాటించి విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సుభాషిణితో కలిసి భోజనాన్ని పరిశీలించారు.

సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

కంభం: విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈఓ అబ్దుల్ సత్తార్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి వాల్‌పోస్టర్లను ఎంఈఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జన విజ్ఞాన వేదిక మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వరికుంట్ల వెంకటేశ్వర్లు, రమణారెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈనెల 18వ తేదీన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12,13,14వ తేదీల్లో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయబ్ రసూల్, మస్తాన్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి పాఠశాలల స్థాయిలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలపై మంగళవారం మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు పర్యవేక్షణలో సైన్స్ టీచర్స్ మండ్ల రామాంజనేయులు, ప్రతిమ చెకుముకి సంబరాల నిర్వహణ, విద్యార్థులకు నిర్వహించబోయే ప్రతిభా పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులతో కలిసి చెకుముకి సంబరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

రేపు శ్రీగిరిలో సుదర్శన హోమం

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దివంగత ఆలూరు వెంకట రమణారావు జయంతి సందర్భంగా గురువారం ఉదయం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు వెల్లడించారు. ఉదయం ఏడు గంటలకు శ్రీవారికి పూలంగి సేవ, వెంకటరమణారావు విగ్రహానికి అభిషేకం, తొమ్మిది గంటలకు సుదర్శన హోమం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రతినిధులు కోరారు. సుదర్శన హోమంలో పాల్గొనదలచిన వారు వివరాలకు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో 93909 67258, 88856 95491 నంబర్లలో వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేయాలి

- రిటైర్డ్ ప్రొఫెసర్ ఆంజనేయస్వామి



ఆంజనేయస్వామిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఒంగోలు సిటీ: కాబోయే ఉపాధ్యాయుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసేందుకు రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తే సాధ్యమవుతుందని పాండిచ్చేరి యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆంజనేయస్వామి అన్నారు. మంగళవారం డైట్ మైనంపాడులో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యాక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన ఎన్నో అంశాలు తెలియజేశారు. విద్యార్థుల్లో ఎందుకు? అనే ప్రశ్న వారి అభివృద్ధికి దోహదం చేస్తుందని వివరించారు. కాబోయే ఉపాధ్యాయులు కేవలం కంటెంట్ మాత్రమే కాకుండా సబ్జెక్టుకు అనుగుణంగా వివిధ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని చెప్పారు. నాటి విద్యారంగ పరిస్థితులను నేటి పరిస్థితులతో పోల్చి నేటి ఉపాధ్యాయుడు తన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. తరగతి గది సమాచారానికి ఒక సోర్స్ మాత్రమేనని, వివిధ రకాల విధానాల ద్వారా సమాచారాన్ని పొంది తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. నేటి ఉపాధ్యాయుడు కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండా సమాచారం సాంకేతికను అందిపుచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు అధ్యక్షత వహించారు. డైట్ లెక్చరర్స్, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు రిటైర్డ్ ప్రొఫెసర్ ఆంజనేయస్వామిని ఘనంగా సన్మానించారు.

కోదండరాముడికి పునర్వసు నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతా సమేత అనంత కోదండరామస్వామి

ఒంగోలు మెట్రో: శ్రీరామచంద్రుడు జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఒంగోలు పీవీఆర్ గర్ల్స్ హైస్కూల్ దగ్గర గడియారం వారి వీధిలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి నిర్వహణలో ఉన్న మహిమాన్వితమైన అనంత కోదండరామస్వామి మందిరం, మంగమూరు రోడ్డు గాంధీనగర్ మూడో లైను సీతారామలింగేశ్వర స్వామి దేవస్థానం, గాంధీ రోడ్డు అనంత కోదండరామ స్వామి దేవస్థానం, మంగమూరు రోడ్డు హరిహర సుత అయ్యప్ప స్వామి క్షేత్రం దగ్గర కొలువై ఉన్న రామాలయం, సత్యనారాయణపురం దిబ్బల రోడ్డు రామాలయం వారి వీధిలో సీత సమేత కోదండ రామస్వామికి అర్చకులు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, సుగంధ పరిమళ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో పురుష సూక్త మంత్రంతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ చేసి అష్టోత్తర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామి వారి మూలమూర్తులకు మంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసి సీతారాముల ఆశీస్సులు అందజేశారు.

అత్యాధునిక పరికరంతో గుండెకు చికిత్స



మాట్లాడుతున్న కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ బాబు

ఒంగోలు సిటీ: గుండెలో క్యాల్షియం పేరుకుపోయి స్టంట్ వేయలేని స్థితిలో అత్యాధునిక పరికరంతో శస్త్ర చికిత్స చేసి ఓ వృద్ధుడిని కాపాడినట్లు మెడిక్యూర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం నగరంలోని రామ్‌నగర్ మెడిక్యూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కరవది గ్రామానికి చెందిన 83 ఏళ్ల శేషగిరిరావు గుండెజబ్బుతో మెడిక్యూర్ ఆస్పత్రికి వచ్చాడని, వైద్య పరీక్షల అనంతరం హైదరాబాద్ లేదా విజయవాడ వెళ్లాలని కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. కుటుంబ సభ్యులు ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని కోరడంతో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి డ్రిల్లింగ్ మిషన్ వంటి యంత్రం ద్వారా క్యాల్షియాన్ని కట్ చేసుకుంటూ స్టంట్ వేసి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. ఇది జిల్లాలో మొట్టమొదటి అరుదైన చికిత్స అన్నారు. 83 ఏళ్ల వయసులో గుండె ఆపరేషన్ కూడా చేసేందుకు వీలుపడని నేపథ్యంలో అత్యాధునిక పరికరం ద్వారా సాధ్యమైందని డాక్టర్ శ్రీధర్‌బాబు చెప్పారు. రోగి తండ్రి సుబ్బారావు మాట్లాడుతూ ఎంత క్లిష్ట పరిస్థితైనా ఇక్కడే వైద్యం అందించాలని కోరామని, డాక్టర్ శ్రీధర్‌బాబు రిస్క్‌తో కూడుకున్న చికిత్స అందించి తన తండ్రి ప్రాణాలు కాపాడారంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మెడిక్యూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మేనేజర్ దాసరి సుధాకర్ పాల్గొన్నారు.

327 పొగాకు బేళ్ల తిరస్కరణ



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 327 పొగాకు బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 1067 బేళ్లను వేలానికి తీసుకురాగా 740 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.316, కనిష్ఠ ధర రూ.70, సరాసరి ధర రూ.240.65 పలికింది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 251 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని దాదానాయుడుపాలెం, చవటపాలెం, రామాయపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి, పోలిరెడ్డిపాలెం గ్రామాల రైతులు 1291 బేళ్లను తీసుకురాగా 1040 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.315, కనిష్ఠ ధర రూ.70, సరాసరి ధర రూ.238.51గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయి.